క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ పత్తిపాక శ్రీధర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంజూరైన రూ.1.70 లక్షల చెక్కును ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కోశాధికారి అను సత్యం, మండల అధ్యక్షుడు విడపు ప్రతాప్ చేతుల మీదుగా సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు దయాకర్, కనుకుంట్ల సతీష్, మండల కమిటీ సభ్యులు సిందె ఆనందరావు, దాసరి రమేశ్, కొలిపాక రాజేందర్, నర్సింగ రావు, కరుణాకర్, జమ్మికుంట మండల ఫొటోగ్రాఫర్లు, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

కూలి చెల్లించాలి



శాయంపేట : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు తక్షణమే కూలి చెల్లించాలని బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుమన్ కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ ఫణిచంద్రకు వినతిపత్రాన్ని అందించారు. కూలీలు ఉపాధి హామీ పనులు చేసి నెలలు గడుస్తున్నా డబ్బులు అకౌంట్లలో జమ చేయలేదని అన్నారు. పేదలపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. డబ్బులు చెల్లించని పక్షంలో పేదలను, కూలీలను ఏకం చేసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

డీఎస్‌కు ఘన నివాళి..



శాయంపేట : మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డి.శ్రీనివాస్ మృతి బాధకరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆ మృతికి సంతాపం తెలియజేస్తూ సోమవారం నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు దామెరకొండ కొమురయ్య డీఎస్ చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కొమురయ్య మాట్లాడుతూ.. డీఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. నాయకులు మారెపల్లి రాజు, రాజేందర్, సదానందం, రాజయ్య, ప్రపంచరెడ్డి, మల్లయ్య, శంకర్, రాజేశ్, సారయ్య, రామస్వామి, చిరంజీవి, సాదిక్, రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ఎల్కతుర్తి : మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రవీందర్ అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందింది. రోజుమాదిరిగానే మేత మేస్తూ పొలం పక్కనేఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన ఎర్త్ వైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. అలాగే విద్యుత్ వైరు ఫెయిల్ అయ్యి ఆదివారం ఓ రైతుకు షాక్ కొట్టింది. ఈ విషయం విద్యుత్ అధికారులకు తెలిసినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గేదె విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు.

పాఠశాలలోని సమస్యలు పరిష్కరించండి



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన కలామ్స్ ఫౌండేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ సత్య శారదదేవికి అధ్యక్షుడు బాషుమియా ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. తొలుత ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం బాషుమియా మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు వివరించారు. విద్యార్థులకు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి పరికి మధుకర్, సలహాదారు ఊడుగుల రాజు, పోగుల అశోక్, కాస రాకేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక 'షక్కర్‌గంజ్ దర్గా'

- కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం
- ప్రతీ ఏటా ఉర్సు గంధం ఉత్సవాలు..
- సౌకర్యాలు లేక భక్తులకు ఇబ్బందులు
- దర్గా సమీపంలోనే రామలింగేశ్వర స్వామి ఆలయం



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు



దర్గా వద్దకు వెళ్లేదారిలో పెరిగిన ముళ్లపొదలు



భక్తులు ముడుపులు కట్టే చెట్టు..



దర్గా సమీపంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం



దర్గా సమీపంలో ఉన్న మంచినీటిగుండం



దర్గాకు వెళ్లేదారిలో ఉన్న పెద్దచెరువు మత్తడి

వేలేరు : ఓవైపు వేలేరు పెద్ద చెరువు.. మరోవైపు పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణం.. మధ్యలో ఉన్న గుట్టపై హజ్రత్ షేక్ షక్కర్‌గంజ్ బాబా దర్గా చూపరులను ఆకర్షింపజేస్తోంది. మండల కేంద్రంలోని అతీ పురాతనమైన కాకతీయుల కాలం నాటి దర్గా సర్వమతాల సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తోంది. వందల ఏళ్ల నుంచి కులమతాలకు అతీతంగా భక్తులందరూ వచ్చి దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకుంటున్నారు. ప్రతీ శుక్రవారం వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి దర్గాకు వచ్చి హజ్రత్ షేక్ షక్కర్ గంజ్ బాబాను దర్శించుకుని కోరిన కోరికలు నేరవేరాలని, తమ కష్టాలు తొలగిపోవాలని దర్గా వద్ద కందూర్ పేరిట మొక్కులు చెల్లించుకుంటారు.

దర్గాకు వందల ఏళ్ల చరిత్ర...

హజ్రత్ షేక్ ఫరీద్ షక్కర్ గంజ్ రహ్మతుల్లా అలైహి బాబా దర్గా సుమారు 11 వ శతాబ్దంలో 900 ఏళ్ల క్రితం నిర్మాణమైంది. వందల ఏళ్ల చరిత్ర ఉన్న దర్గాలో హజ్రత్ షేక్ ఫరీద్ బాబా పేరిట దర్గా వెలసింది. ఇక్కడ ఉన్న సమాధులు ప్రతీఏటా కొంత ఎత్తు పెరుగుతున్నాయని ఇక్కడికి వచ్చే భక్తులు చెబుతుంటారు. దర్గా సమీపంలోనే కాకతీయుల కాలం నాటి స్వయంభూగా వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. రామలింగేశ్వర స్వామి ఆలయం రామప్ప, వేయిస్తంభాల ఆలయాన్ని పోలిన నిర్మాణంతో ఉంటుంది. కాకతీయులు రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు సమీపంలో ఉన్న హజ్రత్ షేక్ ఫరీద్ బాబా దర్గాను కూడా దర్శించుకునే వారని పూర్వికులు అంటున్నారు. అలాగే దర్గా సమీపంలోని గుండంలో ఎంత కరువు వచ్చినా నీళ్లు ఎండిపోవని భక్తులు అంటున్నారు. గుండంలో స్నానాలు ఆచరిస్తే వ్యాధులు దూరమవుతాయని భక్తుల నమ్మకం. గుండంలో తడిబట్టలతో స్నానం చేసి ఐదు బిందెల నీళ్లు గుడిలో పోస్తే కోరిన కొర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

అభివృద్ధికి నోచుకోని దర్గా..

వందల ఏళ్ల చరిత్ర గల హజ్రత్ షేక్ ఫరీద్ బాబా దర్గా ఎన్ని ప్రభుత్వాలు మారినా అభివృద్ధికి నోచుకోవడం లేదు. వేలేరు మండల కేంద్రానికి సూమారు 1 కిలో మీటర్ దూరంలో ఈ దర్గా ఉంటుంది. కానీ దర్గా దగ్గరకు వెళ్లేందుకు భక్తులకు సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర కిలో మీటర్ మేర నడుచుకుంటూ వేళ్లే పరిస్థితి నెలకొంది. దర్గా వద్దకు వెళ్లే దారిలో కట్టపై ఇరువైపులా ముళ్ల పొదలు ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే చెరువు కట్ట దాటిన తర్వాత దర్గా సమీపంలోనే పెద్ద చెరువు మత్తడి ఉండటంతో వర్షాకాలంలో దర్గా వద్దకు వెళ్లేందుకు అవకాశం లేకుండా మారింది. గతంలో దర్గాను ప్రస్తుత స్టేషన్ ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి దర్శించుకుని దర్గా వద్ద కనీస సౌకర్యాలు, కమ్మరిపేట ఆంజనేయస్వామి ఆలయం నుంచి దర్గా వద్దకు రోడ్డు సౌకర్యం, మత్తడి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అది ఇప్పటికీ నెరవేరలేదు. హామీలు ఇచ్చిన ఎమ్మెల్యేలు నిలబెట్టుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి దర్గా అభివృద్ధికి నిధులు కేటాయించాలని భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు, బ్రిడ్జి సౌకర్యం కల్పించాలి



మండల కేంద్రంలో అతీపురాతమైన హజ్రత్ షేక్ ఫరీద్ బాబా దర్గా వద్దకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చెరువు కట్టపై ఉన్న తుమ్మచెట్లు ఇరువైపుల రోడ్డును కప్పేసినట్లు ఉన్నాయి. కట్ట దాటిన తర్వాత ఉన్న మత్తడి వలన వర్షాకాలంలో దర్గా వద్దకు వెళ్లలేకపోతున్నాం. కట్టపై ఉన్న ముళ్లపొదలను తొలగించి, బీటీ రోడ్డు నిర్మాణం, మత్తడి వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

- రహమత్ షరీఫ్, దర్గా కమిటీ అధ్యక్షుడు

దర్గా అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మండల కేంద్రంలోని హజ్రత్ షేక్ ఫరీద్ బాబా దర్గా అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిధులు కేటాయించాలి. దర్గా వద్దకు వచ్చే భక్తులకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలి. అలాగే రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో నమాజ్ చేసుకునేందుకు ఈద్గా చూట్టూ ప్రహరీ, నీటి సౌకర్యాలు కల్పించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా దృష్టి సారించాలి.

- ఎండీ ఆరిఫ్, వేలేరు

హుండీ లెక్కింపు



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ ఇన్‌స్పెక్టర్ సంజీవ రెడ్డి, ఎంపీటీసీ యాటపోలు రాజయణి, ఆలయ ఈఓ కిషన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. మూడు మాసాలకు గాను రూ.5,38,234 ఆదాయం వచ్చినట్లు ఈఓ కిషన్‌రావు తెలిపారు. ఇందులో నాణెలు 29,789, నోట్లు 5,08,445 వచ్చినట్లు పేర్కొన్నారు. 7 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు వెల్లడించారు. పూదరి రవీందర్ గౌడ్, పిడిశెట్టి కనుకయ్య, కోగొండ సమ్మయ్య, మాడిశెట్టి కుమారస్వామి, సర్వస్వతి సేవా సమితి సభ్యులు, గోమాత సేవా సమితి సభ్యులు, వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

వేలేరు : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు విధిగా నివేదికలను తీసుకు రావాలని కోరారు.

నేడు రైతు మహాజనసభ

నడికూడ : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతుబంధు (రైతు భరోసా) పథకంపై చర్చించేందుకు రైతులతో సభ నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు నల్లెల లింగమూర్తి తెలిపారు. రైతు భరోసా పథకంపై రైతులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలను తెలియజేయాలని కోరారు. మండలంలోని రైతులు, సంఘ సభ్యులు, మహాజన సభకు సకాలంలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

లోపియా వ్యాధిని నివారించాలి

- పశువైద్యాధికారి డాక్టర్ సునీల్



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజ్వల్ సిబ్బంది

శాయంపేట : పశువులను వేధిస్తున్న లోపియా వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్స చేయించాలని పశువైద్యాధికారి సునీల్ రైతులకు సూచించారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మూగ జీవాలకు సంక్రమిస్తున్న గాలికుంటు, లోపియా వ్యాధి నివారణకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. పశు సంపదను కాపాడుకోవడానికి ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పశు సంపద కనుమరుగైపోయి యంత్రాల వైపు మళ్లుతున్న తరుణంలో వ్యవసాయంపై ఆధారపడే అనుబంధ రంగాలకు పనులు లేక ఇబ్బందులు పడుతన్నారని తెలిపారు. పశువులకు వచ్చే వ్యాధులను గుర్తించి అనుభవజ్ఞులైన వైద్యులతో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ ఇన్నారెడ్డి, క్షేత్ర సిబ్బంది అక్కల రమేశ్, మానస, రవిచందర్, సునీల్, తిరుపతి, గౌస్, ప్రశాంత్, వైద్య సిబ్బంది రమేశ్, సారంగం, నవయుగ పాలకవర్గ సభ్యులు రాజయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంగారపు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సదానందంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని దేవాదుల పైపులైన్ సమీపంలో గల ప్రభుత్వ భూమితో పాటు పొరంబోకు భూమి మొత్తం 2,28 ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు జేసీబీతో చదును చేశారని తెలిపారు. ఆ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొడ్డు శాంతిసాగర్, పుట్ట దేవరాజు, చిలుక రాజు, కొట్టే అంటోని, కొట్టే శంకర్ పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



నినాదాలు చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

దామెర: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని సింగరాజుపల్లిలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల7న ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణతో పాటు మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక..

అనంతరం నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడు బొచ్చు హరీశ్, అధికారప్రతినిధి వడ్డెపల్లి వివేక్, ప్రధానకార్యదర్శులు చుంచు రామ్, బొచ్చు రాకేశ్, ఉపాధ్యక్షుడిగా ఇనుగాల రాజు, కార్యదర్శులు వడ్డెపల్లి శ్రీకాంత్, సౌరం కిరణ్, కార్యవర్గ సభ్యులు వడ్డెపల్లి సాగర్, వడ్డెపల్లి రాజేశ్, చుంచు సిద్ధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చిన్నారి 'డాక్టర్లు'



డాక్టర్ వేషధారణలో చిన్నారి

పరకాల : జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని బిట్స్ పాఠశాలలో చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. రోగులు, వైద్యుల వేషధారణలో వైద్యపరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు రాయడంతో పాటు ఆరోగ్యం కోసం వారు పలు సూచనలు చేశారు.



దామెర : డాక్టర్ మంజులను సన్మానిస్తున్న సిబ్బంది

దామెర : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా మండల వైద్యాధికారి డాక్టర్ మంజులను శాలువాతో సన్మానించారు. ఫార్మసిస్టు కందకట్ల శరత్‌బాబు, పీహెచ్‌ఎన్ లీల, రాజేశ్వరి, ఏఎన్ఎం ఉమ, హెలెన్ ఉన్నారు.

అసైన్డ్ భూములను కాపాడాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



వేలేరు : మండలంలోని శాలపల్లి గ్రామంలో గల అసైన్డ్ భూములను గ్రామంలోని కొంతమంది సహకారంతో ఓ వీఆర్వో ఆక్రమిస్తున్నాడని శాలపల్లి గ్రామానికి చెందిన కూరపాటి రమేశ్‌తో పాటు గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వీఆర్వో గ్రామంలోని చెరువులు, కుంటలు, రోడ్లకు సంబంధించిన భూములను కబ్జా చేస్తున్నాడని, 1955లో పద్మశాలీలకు ఇచ్చిన భూములను, 1972లో ఇందిరాగాంధీ ఇచ్చిన భూములపై కన్నేసి కొంతమంది మాజీ మావోయిస్టులను వెంటపెట్టుకుని వారి సహకారంతో పేదల భూముల రికార్డులను తారుమారు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా చేసిన భూములకు తప్పుడు నంబర్లు సృష్టించి భూములను కాజేస్తున్నాడని అందులో వివరించారు. ఈ భూములపై జిల్లాస్థాయి రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి దళితుల, పేదల భూములను కాపాడాలని, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నర్సంపేట : పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 1990–91 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులుఉ స్థానిక పద్మశాలి సంఘం భవనంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేటలో చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన సుమారు 50 మంది స్నేహితులు హాజరై సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి ముఖ్యఅతిథిగా హాజరై పూర్వవిద్యార్థులను శాంతివనానికి ఆహ్వానించారు. పూర్వ విద్యార్థులు ఆయన ఆహ్వానం మేరకు శాంతివనాన్ని సందర్శించి అక్కడ ప్రకృతిని ఆస్వాదించారు. స్నేహితులంతా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రజిని, పోతుర్ల స్వరూప, ఉమ, మీనా, ఆకుల రమాదేవి, మంజుల, సునీత, భాగ్య, రేణుక, అనిత, సుజాత, శ్రీలత, గోక కవిత, విజయలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



ఎల్కతుర్తి : మొక్కలు నాటుతున్న అధికారులు



శాయంపేట : మొక్కలు పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి రత్నాకర్

ఎల్కతుర్తి : ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని స్పెషల్ ఆఫీసర్, వెటర్నరీ డాక్టర్ దీపిక అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగాంగా సోమవారం మండలంలోని జీల్గుల, జగన్నాథపూర్ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విరివిగా మొక్కలు నాటడం వలన అవి వృక్షాలుగా ఎదిగి భవిష్యత్ తరాల మనుగడకు దోహద పడుతాయన్నారు. అంతే కాకుండా అధికంగా చెట్లను పెంచడం వలన సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండుతాయని అన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కల పెంపకం అవసరమన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని గ్రామస్తులకు గ్రామపంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ మొక్కలను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో నర్సరీలో పెంచిన మొక్కలను పంపిణీ చేసినట్లు రత్నాకర్ తెలిపారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలతోనే మానవాళి మనుగడ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సదయ్య, జీపీ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

ఎల్కతుర్తి : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి పది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వేతనాలు చెల్లించాలని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు.. గ్రామపంచాయతీ కార్మికులు గ్రామ పరిశుభ్రత, పల్లె పకృతి వనం, స్మశాన వాటిక నిర్వహణ, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా మందుల పిచికారి, డ్రైనేజీ వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జీపీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ వేతనాలు ఇవ్వకపోవడం వలన అప్పులు చేస్తూ కాలం వెల్లదీస్తున్నట్లు తెలిపారు. అలాగే వారి పిల్లల చదువులకు ఫీజులు కట్టలేక పోతున్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు మల్లరాజు, ఎలగందుల శంకర్, దేగల వెంకటేశ్వర్లు, బోయిన బాబు, వేల్పుల రాజు, సందీప్ పాల్గొన్నారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకే ఇవ్వాలని కోరుతూ ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడారు. గత ప్రభుత్వం 40 ఇళ్ల నిర్మాణం చేపట్టగా పూర్తి కాక ముందే కొందరు ఆక్రమించుకున్నారని తెలిపారు. ఆక్రమించుకున్న వారిలో చాలా మంది అనర్హులన్నట్టు చెప్పారు.

మెళకువలతో ఉద్యోగ అవకాశాలు మెండు

నర్సంపేట రూరల్ : శిక్షణలో నేర్చుకున్న మెళకువలతో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్స్ (బిట్స్) ప్రిన్సిపాల్ హరిహరన్ తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో టాస్క్ సహకారంతో 'మెడికల్ కోడింగ్ అండ్ బిల్లింగ్' పై ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి శిక్షణ దోహదం చేస్తుందని తెలిపారు. శిక్షణ తోనే ఉద్యోగాలు సాధించడం సాధ్యపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, రిసోర్స్‌పర్సన్ నిఖిల్ చంద్ర, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రవి, డాక్టర్ మనీష్, తదితరులు పాల్గొన్నారు.